క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌రూరల్: టవర్ నిర్మాణ పనుల కారణంగా బంగారుగూడ, మావల, కైలాస్‌నగర్ ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారి మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

29న 'చలో ఆదిలాబాద్'

ఉట్నూర్: మతం మారిన గిరిజనులను షెడ్యూల్డ్ తెగల జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన సాంస్కృతిక పరిరక్షణ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ జనజాతి సురక్ష మంచ్ ఉట్నూర్ డివిజన్ ఇన్‌చార్జి మెస్రం జంగు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో చలో ఆదిలాబాద్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జనజాతి సురక్ష మంచ్ నాయకులు బాలేరావ్, గంగారాం, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆమరణ దీక్షను అడ్డుకున్న పోలీసులు

బేల: విక్రాంత్ కంపెనీ సోయా విత్తనాలు వేసి నష్టపోయిన బాధిత రైతుల పక్షాన మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం ఎదుట బుధవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు అడ్డుకున్నారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, పలువురు నాయకులను ముందస్తు అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ కోల నరేష్‌కుమార్ ఇచ్చిన హామీ మేరకు దీక్ష విరమించుకున్నామని, పది రోజుల్లో బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమకాకపోతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

నేరడిగొండ: ఆరోగ్యపై ప్రతిఒక్కరూ శ్రద్ధ పెట్టాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎండీ సద్దాం, మండల ఆరోగ్య విస్తరణ అధికారి హరికుమార్ గౌడ్‌లు అన్నారు. బుధవారం మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజాలో 30 మంది కార్మికులకు జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అవసమైతే తప్పా ఎండలో బయటకు వెళ్లావద్దన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

దుబార్‌పేట్‌లో కంటివెలుగు

ఇచ్చోడ: కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి సురేశ్ కోరారు. మండలంలోని దుబార్‌పేట్‌లో బుధవారం కంటివెలుగు శిబిరం నిర్వహించారు. 80 మందికి కంటి పరీక్షలు చేసి, కళ్లద్దాలు పంపిణీ చేశారు. అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చాకటి అభిమాన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయం

నేరడిగొండ: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆదేశాల మేరకు బుధవారం తర్నం గ్రామ పంచాయతీ పరిధిలోని అడ్డి అభినయరెడ్డికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.38 వేల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, సర్పంచ్ విశాల్, సోషల్ మీడియా కన్వీనర్ నల్ల అడెల్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువుల సంచారం నిషేధం

ఇచ్చోడ: మండల కేంద్రంలో రోడ్లపై పశువుల సంచారాన్ని నిషేధించినట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో మాట్లాడారు. మండల కేంద్రంలో రోడ్లపై సంచారిస్తున్న పశువులను వాటి యజయానులు తీసుకుపోవాలన్నారు. లేదంటే గోశాలకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

22 నుంచి గురుకులాల్లో శిక్షణ శిబిరాలు

ఉట్నూర్: ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు గిరిజన గురుకులాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు గిరిజన గురుకులం రీజినల్ కో–ఆర్డినేటర్ గంగాధర్ అన్నారు. బుధవారం లాల్‌టెక్డీ గిరిజన బాలుర జూనియర్ కళాశాలలో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణపై గురుకుల కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ శిబిరాల్లో విద్యార్థులకు యంగ్ లీడర్స్, డిజైన్ థింకింగ్, ఆస్ట్రానామి, బేసిక్ అబాకస్, లైఫ్ స్కిల్స్, ఆర్ట్స్, డాన్స్, మ్యూజిక్, బ్రైటర్ మైండ్స్, థియేటర్ ఆర్ట్స్, డ్రోన్ మేకింగ్, బేసిక్ ఇంగ్లీష్, అంశాలతో పాటు బాక్సింగ్, క్రికెట్, గోల్ఫ్, పుట్‌బాల్, హండ్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, రెజ్లింగ్, అర్చరీ తదితర 25 అంశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. వేసవి శిక్షణ శిబిరాలకు ఆరో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేయాలన్నారు.

మహిళల కోసం 'సమ్మాన్ సేవింగ్'

- పోస్టాఫీసుల్లో ప్రత్యేక ఖాతాలు
- సేవింగ్స్‌పై 7.5 శాతం వడ్డీ
- ఏప్రిల్ నుంచి ప్రారంభమైన పథకం

బోథ్: మహిళలు, బాలికలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. ఇటీవల మహిళా సమ్మాన్ పొదుపు ఖాతాలను ప్రవేశపెట్టింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈఏడాది ఫిబ్రవరిలో 2023– 24 బడ్జెట్‌లో దీన్ని ప్రకటించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఇది అమలవుతోంది. ఈ పొదుపు పథకంలో 7.5 వడ్డీని ఇస్తారు. రెండేళ్లకే 7.5 శాతం వడ్డీని ఇవ్వగలిగిన ఏకైక పథకం ఇదొక్కటే. 2025, మార్చి 31 వరకు మాత్రమే ఇది అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం పోస్టాఫీసుల్లో మాత్రమే దీన్ని అమలు చేస్తున్నారు. ఖాతా ప్రారంభం నుంచి రెండేళ్లు పూర్తయిన తరువాత పూర్తి మెచ్యూరిటీ లభిస్తుంది. అప్పుడు 7.5 శాతం వడ్డీతో రూ. వెయ్యి పెట్టుబడికి రూ.1,160, రూ.10,000 పెట్టుబడికి రూ. 11,602, రూ.50,000 పెట్టుబడికి రూ.58,011, రూ.1,00,000 పెట్టుబడికి 1,16,022, రూ.2,00,000 పెట్టుబడికి రూ.2,32,044 మెచ్యూరిటీ మొత్తంగా చెల్లిస్తారు.

ఖాతా ఎలా ప్రారంభించాలి..

మహిళ అయితే సొంతంగా, బాలిక అయితే ఆమె తరపున సంరక్షకుడు ఖాతాను ప్రారంభించే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక ఫాం ఉంటుంది. ఆధార్ కార్డు/ పాన్ కార్డులు ఉండాలి. కొత్త ఖాతాదారుడు అయితే నగదు మొత్తం లేదా చెక్కుతో పాటు పే ఇన్ స్లిప్‌ను కూడా పోస్టాఫీసులో సమర్పించాలి.

ఎంత డిపాజిట్ చేయాలి..

కనిష్ఠంగా రూ. వెయ్యి, గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు ఖాతాలో డిపాజిట్ చేయాలి. ఒకరు ఒకటికి మించి ఎన్ని ఖాతాలు అయిన తీసుకోవచ్చు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తపాలా శాఖ అధికారులు

అయితే ఒక ఖాతాకు మరో ఖాతాకు మధ్య మూడు నెలల వ్యవధి ఉండాలి. జాయింట్ ఖాతాలకు అవకాశం లేదు.

వడ్డీ ఎంత..

సంవత్సరానికి 7.5 శాతం వడ్డీ ఉంటుంది. మూడు నెలలకు ఒకసారి వడ్డీని లెక్కించి ఖాతాలో జమ చేస్తారు. ఖాతా మూసి వేసే సమయంలో వడ్డీని చెల్లిస్తారు. నిబంధనకు విరుద్ధంగా ప్రారంభించినా.. లేదా డిపాజిట్ చేసినా పీవో ఎస్‌బీ వడ్డీ రేటు మాత్రమే వర్తిస్తుంది.

ఉపసంహరణ ఎలా?

పోస్టాఫీసుల్లోని కొన్ని ఖాతాల్లో ప్రీ మెచ్యూర్ ఉపసంహారణకు అవకాశం లేదు. అయితే ఈ ఖాతాలకు మెచ్యూర్ ఉపసంహరణ అవకాశం ఉంది. ఖాతా ప్రారంభించిన తేదీ నుంచి ఏడాది తర్వాత 40 శాతం ప్రీ మెచ్యూర్ మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు. ఖాతాదారుడు లేదా సంరక్షకుడు మరణించినా.. ఇతర ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నా.. అత్యవసరంగా ఉపసంహరించుకోవచ్చు. ఖాతా తెరిచిన ఆరు నెలల తరువాత కూడా దీన్ని ఉపసంహరించుకోవచ్చు. అయితే వడ్డీ శాతంలో 2 శాతం తక్కువ చేసి చెల్లిస్తారు. అంటే 7.5 వడ్డీ శాతంతో కాకుండా 2 శాతం తగ్గించి 5.5 శాతం వడ్డీ చెల్లించడం జరుగుతుంది.

సమస్యలుంటే తెలియజేయండి

ఆదిలాబాద్‌రూరల్: రైతులకు సంబంధించిన సమస్యలు ఉంటే గ్రామస్థాయిలో నియమించినా పేరా లీగల్ వలంటీర్ (పీఎల్‌వీ) ద్వారా రాత పూర్వకంగా తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఎంఆర్ సునీత అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామడిగూడలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకే ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇక్కడ పరిష్కరం కానీ వాటిని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జిల్లా జడ్జి మాధవి కృష్ణ, డీఎల్ఎస్ సెక్రెటరీ క్షమాదేశ్‌పాండే, గ్రామ పటేల్ తులసీరాం, సర్పంచ్ ఆత్రం యాదవ్‌రావ్, నగేశ్, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, ఏఎస్పీ శ్రీనివాస్‌రావ్, తహసీల్దార్ శివరాజ్, ఇన్‌చార్జీ ఎంపీడీవో శంకర్ పాల్గొన్నారు.

'అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్' సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నార్నూర్: అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలను రైతులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు న్యాయమూర్తి సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని తాడిహత్నూర్ రైతువేదికలో మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గారాణి రైతులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. విత్తనాలు, మందులు గుర్తింపు ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లోనే కొనుగోలు చేసి రశీదు పొందలన్నారు. రైతులు, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పరిమళ జైన్, బార్ అధ్యక్షుడు ప్రభాకర్, వ్యవసాయాధికారి రమేశ్, ఎస్‌పీవో కిష్టయ్య, సర్పంచ్ రాథోడ్ మధుకర్, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

నార్నూర్: మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీ, విజయ్‌నగర్ కాలనీలో నీటి వసతి కల్పించాలని బుధవారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. గత వారం రోజులుగా నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో రమేశ్, సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడారు. సాయంత్రం వరకు నీటి సరఫరా చేస్తామని ఎంపీడీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సమరభేరి సభ విజయవంతం చేయండి

బేల: జిల్లా కేంద్రంలో ఈనెల 26న నిర్వహించే నిరుద్యోగుల సమరభేరి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని తనీషా గార్డెన్ నుంచి కలెక్టర్ చౌరస్తా, వినాయక్ చౌరస్తాల మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. సమావేశంలో బోథ్ నియోజకవర్గం నాయకులు ఆడే గజేందర్, క్లెం నారాయణ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, ఫైజుల్లాన్, వాంఖడే వామన్, గుండవార్ సంజయ్, మడావి చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆదిలాబాద్‌అర్బన్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం పట్టణంలోని నేతాజీచౌక్‌లో అదిత్య ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అదిత్య, కౌన్సిలర్ ప్రకాశ్, ప్రమోద్ కుమార్ ఖత్రి, శివాజీ, ఉత్తం, రాజు, పవన్, ప్రమోద్, కృష్ణ, సతీశ్ పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఉట్నూర్: ముస్లింల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆజ్మీర రేఖానాయక్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఆమె బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పంద్రం జైవంత్ రావ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కందుకూరి రమేశ్, కోఆప్షన్ సభ్యుడు రషీద్, దాసండ్ల ప్రభకర్, హాజీమోద్దీన్ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని సోనాల గ్రామంలో ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, తుల శ్రీనివాస్, ఇర్ల అఖిల్ పాల్గొన్నారు.

తాంసి: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం అని టీపీసీసీ సభ్యుడు వన్నెల అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మసీదులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ కన్వీ నర్ సంతోశ్, కిష్టన్న, రామన్న యాదవ్, బుజ్జన్న, వైహిద్, హైమద్, షబ్బీర్ పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

బోథ్: మండల కేంద్రంలోని షాదీఖానాలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. మైనార్టీల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. జెడ్పీటీసీ సంధ్యారాణి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, నారాయణ రెడ్డి, సర్పంచ్ సురేందర్ యాదవ్, వైస్ ఎంపీపీ లింబాజీ, జగన్, సుభాష్, మేడిచెల్మ ప్రవీణ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

బేల: తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ గంగాధర్ అన్నారు. బుధవారం మండలంలోని మశాల(బి) గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటింటికీ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, ఠాక్రే గంభీర్, జక్కుల మధుకర్, సతీశ్‌పవార్, బండి సుదర్శన్, ఠాక్రే మంగేష్, గోడం సునీల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగాధర్

ముగిసిన స్వచ్ఛభారత్ శిక్షణ

తాంసి: మండలంలోని కప్పర్ల రైతువేదికలో స్వచ్ఛ భారత్ రెండో విడతలో భాగంగా తాంసి, భీంపూర్ మండలాల పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు, ఉపాధిహామీ సిబ్బందికి జిల్లా కోఆర్డినేటర్ సందీప్ శిక్షణ ఇచ్చారు. రెండు రోజులుగా కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఇంకుడు గుంతల నిర్మాణం, తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి సేంద్రీయ ఎరువు తయారీపై శిక్షణ ఇచ్చారు. అధికారులు జావిద్, ఎంపీవోలు సుధీర్‌రెడ్డి, వినోద్, ఐకేపీ ఏపీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ఆదిలాబాద్‌అర్బన్: అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని ఆదిలాబాద్ ఫైర్ స్టేషన్ అధికారి దుర్గే శివాజీ అన్నారు. అగ్ని ప్రమాద వారోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని షాపింగ్ మాల్స్, వ్యాపార సముదాయాలు, ఫంక్షన్ హాళ్లు, తదితర ప్రాంతాల్లో తిరుగుతూ ప్రమాదాల నివారణపై కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది రవి, లోక్‌నాథ్‌రెడ్డి, మధుకర్, అఖిల్ కుమార్, ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. బాబోయ్ కుక్కలు



బజార్‌హత్నూర్: మండలంలో కుక్కల బెడదతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటు చికిత్స పొందిన బాధితులు రెండు నెలల్లో 56 మంది ఉన్నారు.

సంబంధిత అధికారి: మహేందర్‌రెడ్డి, ఎంపీవో బజార్‌హత్నూర్, ఫోన్: 96030 67148

చెట్ల కొమ్మల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

సిరికొండ: విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగలకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం 'సాక్షి'లో విద్యు త్ తీగలు సరిచేయండి అనే కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రంలో ఏఈ రోహిదాస్, లైన్‌మెన్ మల్లేశ్‌లు సిబ్బందితో చెట్ల కొమ్మలు తొలగించారు.



చెట్టు కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

నార్నూర్: ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సంఘం అధ్యక్షుడు గోవింద్, కార్యదర్శి రాథోడ్ శారదలు డిమాండ్ చేశారు. బుధవారం మూడో రోజు ఐకేపీ కార్యాలయం ఎదుట సమ్మె చేశారు. 20 ఏళ్లుగా గ్రామాల్లో మహిళ స్వయం అభ్యున్నతికి, మహిళ స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీవోఏలు పాల్గొన్నారు.

నేరడిగొండ: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పని చేస్తున్న ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు భూపతి రాజు, ఉపాధ్యక్షుడు లస్మన్నలు డిమాండ్ చేశారు. వీవోఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయం ఎదుట బుధవారం నిరవధిక సమ్మె చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు.

సిరికొండ: మహిళ గ్రామైక్య సంఘాలలో పని చేస్తున్న వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్‌తో బుధవారం సెర్ప్ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. సమ్మెకు సంఘీభావంగా తెలుగుదేశం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు శ్రీకర్, దత్తు, రాజ్‌కుమార్, మంజుల, కోత్మబాయి, రాజు, జగదీశ్, కిశోర్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని మండల వీవోఏల సంఘం అధ్యక్షుడు షేక్ ఫెరోజ్ డిమాండ్ చేశారు. బుధవారం ఐకేపీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరుకుంది. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం మండల ఉపాధ్యక్షుడు కోట్నాక్ భారిక్‌రావ్, వీవోఏలు వావల్కర్ జైపాల్, మోరే చంద్రకాంత్, శివాజీ పాల్గొన్నారు.



నార్నూర్: ఆందోళన చేస్తున్న వీవోఏలు

అటవీ సంరక్షణ చర్యలు చేపట్టాలి

- సీసీఎస్ శర్వానన్

నేరడిగొండ: అటవీ సంరక్షణ కోసం చర్యలు చేపట్టాలని సీసీఎఫ్ శర్వానన్ అన్నారు. బుధవారం మండలంలోని నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. అటవీ జంతువులను రక్షించడంతో పాటు కలప స్మగ్లింగ్ జరగకుండా చూడాలన్నారు. అనంతరం వాంకిడి పరిధిలో బంధం, నేరడిగొండ మండల కేంద్రంలోని నర్సరీలను సందర్శించారు. మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలన్నారు. ఆయన వెంట ఆదిలాబాద్ డీఎఫ్‌వో రాజశేఖర్, ఇచ్చోడ ఎఫ్‌డీవో బర్నోబా, నేరడిగొండ ఎఫ్ఆర్‌వో గణేశ్, ఎఫ్‌బీవో భీమ్‌జీ, సిబ్బంది ఉన్నారు.

అడవులను పరిరక్షించాలి

బోథ్: మండలంలోని కౌఠ(బి) అటవీశాఖ బీట్ పరిధిలోని అర్బన్ పార్కును బాసర జోన్ సీసీఎస్ శర్వానన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. జంతువులు, పలు రకాల పక్షులు అడవుల్లోకి రావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సొనాలలో గల బీట్ నివాస సముదాయాన్ని పరిశీలించారు. కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. ఆయన వెంట డీఎఫ్‌వో రాజశేఖర్, ఎఫ్‌డీవో బర్నోబా, ఎఫ్ఆర్‌వో ప్రణయ్, సిబ్బంది ఉన్నారు.



టేకు చెట్లను పరిశీలిస్తున్న సీసీఎఫ్ శర్వానన్

సంక్షిప్త వార్తలు

సరుకుల పంపిణీ

బోథ్: మండల కేంద్రానికి చెందిన యువకుడు మీర్ ఇర్షాద్ అలీ రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని 120 పేద ముస్లిం కుటుంబాలకు కిరాణ సరుకులు బుధవారం అందించారు. కార్యక్రమంలో మహేందర్, జమ్ము, తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభకు తరలిరండి

బోథ్: ఇంద్రవెల్లిలో గురువారం జరిగే సంస్మరణ సభకు ఆదివాసీలు తరలిరావాలని ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం భుక్తి కోసం ఆదిసీలు అమరులయ్యారని వారి సంసర్మరణ సభకు ప్రతిఒక్కరూ హాజరు కావాలన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ మాతృమూర్తి లక్ష్మిబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దండే విఠల్, బీఆర్ఎస్ యువజన నాయకులు భుక్య జాన్సన్ నాయక్‌లు బుధవారం వైస్ ఎంపీపీ కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట ఎంపీపీ జైవంత్‌రావు, సర్పంచ్ మల్లిక, ధరని రాజేశ్, రవీందర్, కాటం రమేశ్ ఉన్నారు.

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నంది అడెల్లు తల్లి ఇటీవల మృతి చెందింది. కాగా.. జెడ్పీటీసీ అనిల్ జాదవ్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

సభ్యత్వం నమోదు

బోథ్: రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్ష ఎన్నిక కోసం సంఘం ఓటరు సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగుతోందని సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ తెలిపారు. బుధవారం బోథ్ మండల కేంద్రానికి వచ్చిన ఆమె సభ్యత్వ నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆసాల సదాశివ్, పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్న, జక్కుల వెంకటేశ్, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డును అధికారులు పర్యవేక్షించాలి

బోథ్: మండలంలోని వేంకటేశ్వర ఆలయం నుంచి ధన్నూర్ మీదుగా నిర్మిస్తున్న రోడ్డును అధికారులు పర్యవేక్షించాలని కాంగ్రెస్ నాయకులు పసుల చంటి అన్నారు. రోడ్డుపై దమ్ము లేస్తుందని, నీటితో క్యూరింగ్ చేయాలన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

బోథ్: మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త మీర్ ఇర్షాద్ అలీ స్థానిక మరాఠీ కాలనీలో సీపీఆర్‌పై కాలనీవాసులకు బుధవారం అవగాహన కల్పించారు. సీపీఆర్ ఎలా చేయాలో ఎల్ఈడీ తెర ద్వారా ప్రజలకు చూపించారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, గణేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

మొరం తవ్వకాలు చేపడితే చర్యలు

నేరడిగొండ: అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పవన్‌చంద్ర హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొరం తవ్వకాలు జరుగుతున్న వాటికి ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఈ విషయంలో అధికారులు అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తప్పవని హెచచరించారు.

చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఇద్దరికి చోటు

ఆదిలాబాద్‌అర్బన్: వాణిజ్య, వర్తక వ్యాపార సంఘము (ఛాంబర్ ఆఫ్ కామర్స్)లో కొత్తగా ఇద్దరికి చోటు దక్కింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా గంద్రత్ సంతోశ్, కోశాధికారిగా నితీశ్ మాఖరియాను నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కమల్ కిషోర్ అగర్వాల్ తెలిపారు. జిల్లాలోని చాంబర్ ఆఫ్ కామర్స్‌లో భాగస్వామ్యం లేని వ్యాపార సంఘాలకు సభ్యత్వం ఇచ్చి త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని నియమిస్తామన్నారు.



గంద్రత్ సంతోశ్



నితీష్ మాఖరియా